క్లుప్తంగా

ఆంజనేయులుకు ఎమ్మెల్యే మద్దిశెట్టి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి నుసుం చిన ఆంజనేయులు పార్టీ అభ్యున్నతికి చేసిన సేవలు మరువలేని వని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మాధవరంలో గురువారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాధవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న నుసుం సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాసరెడ్డి, సర్పంచులు సుబ్బారావు, వలి, మాజీ సర్పంచి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: మండలంలోని యడవల్లి బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని యడవల్లి బీసీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారి డి.వహిద గురువారం తెలిపారు. వసతి గృహంలో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని, జూలై 31వ తేదీ వరకూ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులతో పాటు విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చదువులో పూర్తిగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి చదువులో ముందుకు తీసుకెళ్లేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.

ఆర్‌ఓ ప్లాంట్‌కు మరమ్మతులు

తాళ్లూరు: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని వాటర్ ప్లాంట్‌కు జరిగిన మరమ్మతులను సర్పంచి మేకల చార్లెస్ సర్జన్, కార్యదర్శి లక్ష్మీకాంత్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్యలు గురువారం పరిశీలించారు. గతంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ఐదేళ్ల నుంచి మూలన పడటంతో స్థానికులు విజ్ఞప్తి మేరకు స్పందించారు. సర్పంచి మేకల చార్లెస్ సర్జన్ రూ. 40 వేలు కేటాయించటం, అంజయ్య రూ.15 వేలు సమకూర్చడంతో మరమ్మతులు పూర్తయ్యాయి. త్వరలోనే ప్లాంట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సర్పంచి మేకల చార్లెస్ సర్జన్ తెలిపారు.

టీటీడీ చైర్మన్ వైవీకి వినతి



వైవీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీపీలు

తాళ్లూరు: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని తాళ్లూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం కలిసి పలు దేవాలయాలను పునర్నిర్మాణానికి చేయూత ఇవ్వాలని విన్నవించారు. తాళ్లూరు ఎస్సీ కాలనీ, తూర్పుగంగవరం హరిదాస్ నగర్, బెల్లంకొండవారిపాలెంలో పోలేరమ్మ గుడి నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బెల్లంకొండవారిపాలెం అంకమ్మ తల్లి, తాళ్లూరు, రజానగరం ఎస్సీ కాలనీల్లో రామాలయాల నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైవీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో మాజీ ఎంపీపీలు కోట రామిరెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఐవీ రెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రామకృష్ణ ఉన్నారు.

విత్తన దుకాణాలపై అధికారుల దాడులు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

త్రిపురాంతకం: విత్తన దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విధిగా రసీదు పొందాలని మార్కాపురం ఏడీఏ రమాదేవి తెలిపారు. త్రిపురాంతకంలోని విత్తనాల దుకాణాల్లో అమ్మకాలు సాగిస్తున్న పత్తి, మిర్చి తదితర విత్తనాల ప్యాకెట్లపై లేబుల్ పరిశీలించి ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విధిగా రసీదు పొంది ఉంటే వారికి నష్టం జరిగినప్పుడు ప్రభుత్వ అధికారులకు లిఖిత పూర్వకంగా ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విత్తన కొనుగోళ్లలో నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈమె వెంట ఏఓ కె.నీరజ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఇష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తు సాధించాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



విద్యార్థులకు నగదు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదువుతూ ఉజ్వల భవిష్యత్తు సాధించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మంచి మార్కులు సాధించిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు, పదో తరగతి విద్యార్థులను గుర్తించి జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అన్నా మాట్లాడారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎటువంటి వసతులు సమకూర్చకుండా విద్యా వ్యవస్థను పూర్తిగా విస్మరించిందన్నారు. నాడు–నేడు కింద జగనన్న ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్తును అందించాలనే తపనతో జగనన్న ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా రూపుదిద్దడమే కాకుండా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, భోజన వసతి వంటి వాటిని సమకూర్చడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రదర్శించి చూపరులను అలరించారు. ఎంపీపీ కడప లక్ష్మి, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఎంపీడీఓ హేమలత, తహసీల్దార్ కె.విజయకుమారి, ఎంఈఓ నరసింహారావు, కొమరోలు ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు గిరిధరశర్మ, లక్ష్మీదేవి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆరు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు సీఎం జగన్ పెద్దపీట



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: దేశంలోనే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ గురువారం సత్కరించారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు షేక్ హసీనా భాను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఎస్‌వీ సౌగంధిక, ఎం.సంతోష్, సీహెచ్ కీర్తన, కేవీ సంధ్య, పి.యశ్వంత్‌తో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ప్రథమ స్థానంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం రూ.10 వేలు, తృతీయ స్థానంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యా విధానంలో , పాఠశాలకు మౌలిక వసతులు కల్పించడంలో, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ స్థాయిలో తలదన్నేలా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏ మాత్రం గౌరవం తగ్గకుండా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి తగిన గౌరవం, గుర్తింపు అందించడంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారికి నగదు బహుమతులతో పాటు సత్కరించడం అభినందనీయమన్నారు. ఎంపీపీ సుధా అచ్చయ్య, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, తాళ్లూరు జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సైదా పాల్గొన్నారు.

అమ్మఒడి.. అంగన్‌వాడీ



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

మార్కాపురం టౌన్: అంగన్‌వాడీ బడి అమ్మ ఒడి లాంటిదని సీడీపీఓ సుశీల పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో జన భాగస్వామ్య కార్యక్రమం నిర్వహించారు. కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి మాట్లాడుతూ చిన్నారుల మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.బుజ్జి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

పుల్లలచెరువు: బాల్య దశలో మొదటి ఆరేళ్లు ఎంతో విలువైందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివలక్ష్మి అన్నారు. గురువారం పుల్లలచెరువు అంగన్‌వాడీ సెంటర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జనభాగీదారి ర్యాలీ నిర్వహించి పిల్లల సామూహిక వేడుక నిర్వహించారు. శివలక్ష్మి, కుమారి మాట్లాడుతూ బాల్యదశలో మొదటి మూడేళ్లు అమ్మఒడికి పరిమితమైన పిల్లలు ఆ తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఈ వయసులో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, ఆట, పాట, కథల ద్వారా పూర్వప్రాథమిక విద్యను అందించడం ద్వారా పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు దోహదపడుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చూసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. మహిళా పోలీసు పావనిబాయ్ పాల్గొన్నారు.

దొనకొండ: మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్చాలని ప్రథమ డిస్టిక్ కో ఆర్డినేటర్ సోము వెంకట్రావు అన్నారు. మండలంలోని ఆరవల్లిపాడులో సూపర్‌వైజర్‌లు సుభాషిణి, ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం జన భాగీ ర్యాలీ నిర్వహించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కురిచేడు: ఆట పాటల ద్వారా నేర్పించే విద్య చిన్నారుల భవిష్యత్తుకు తొలిమెట్టు అవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజరు సీహెచ్ సుభాషిణి పేర్కొన్నారు. స్థానిక నుసుం బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జన భగీదారీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్యాడ్యుయేషన్ డే సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి ఐదేళ్లు నిండిన అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు.

తాళ్లూరు: చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించి పూర్వ విద్యను బలోపేతం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత కోరారు. మండలంలోని రమణాలవారిపాలెం, దారంవారిపాలెం గ్రామాల్లో గురువారం జన భాగస్వామ్యం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గ్రాడ్యుయేట్స్ డే నిర్వహించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. మూడేళ్లు నిండిన చిన్నారులకు పాఠశాలలకు పంపించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పశువుల బీమా రైతుకు ఆసరా



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీ రమేష్‌బాబు

కురిచేడు: రైతులు తమ బిడ్డల్లా పెంచుకునే పశువులకు బీమా చేయించటం ఆయా రైతులకు ఆపత్కాలంలో ఆసరా అవుతుందని పశువైద్యశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పశువైద్యశాల ఆవరణలో గురువారం అదనపు సంచాలకులు నాగభూషణబాబు అధ్యక్షతన పశుపోషకులకు వైఎస్సార్ పశుబీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పశువుల్లో నాటు, బెరిక్ అనే రెండు రకాల పశువులకు బీమా చేయాల్సి ఉందన్నారు. బీపీఎల్, ఏపీఎల్ అనే రెండు విధాలుగా ప్రీమియం ఉంటుందన్నారు. బీపీఎల్ కింద నాటు పశువులకు రూ.192, బెరిక్ పశువులకు రూ.384 ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. మూడేళ్లకు ఒకసారి చెల్లించే ఈ ప్రీమియంతో నాటుపశువులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే రూ.15 వేలు, బెరిక్ పశువులకు రూ.30 వేల బీమా వస్తుందన్నారు. ఏపీఎల్ వారికి నాటు పశువులకు రూ.480, బెరిక్ పశువులకు రూ.960 ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. బీమా చేసిన 24 గంటల్లో అమలులోకి వస్తుందన్నారు. వైద్యాధికారులు దేవారెడ్డి నాయక్, రమేష్‌బాబు, రైతులు, ఏహెచ్‌ఏలు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

హైవేపై ఆక్రమణల తొలగింపు



తొలగిస్తున్న ఆక్రమణలు

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్ నుంచి పాత సినిమా హాల్ సెంటర్ వరకు హైవేకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు ఆక్రమణల తొలగింపు చర్యలు కొనసాగుతున్నాయి. సర్వీస్ రోడ్లపై వాహనాలు వెళ్లే పరిస్థితి లేదని, రోడ్డును ఆక్రమించి దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టుకోవడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారిందని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. జేసీ ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు, హైవే నిర్వాహకులతో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఏడాది క్రితం హైవేకు ఇరువైపులా ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఉన్న నిర్మాణాలు తొలగింపుపై చర్యలు చేపట్టి పూర్తి చేయకుండానే వదిలేశారు. కనీసం ఇప్పుడైనా పూర్తి స్థాయిలో ఆక్రమణలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులకు స్థలం కేటాయించాలని కోరుతున్నారు. ఒకచోట ఎక్కువ, మరోచోట తక్కువగా ఆక్రమణలు తొలగించకుండా సక్రమంగా చేయాలని దుకాణ యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కంభం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని పట్టణంలోని నాయక్ వీధి ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ సహేరాబేగం అన్నారు. మండల కేంద్రం కంభం పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రభుత్వం అందించే విద్యా పథకాలు వివరిస్తూ ఆవాస ప్రాంతాల్లో ఇంటింటి సర్వే ద్వారా అందరినీ ఆకట్టుకుంటున్నారు. విద్యార్థి సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలే సరైనవి, పుస్తక జ్ఞానంతో పాటు లోకజ్ఞానాన్ని అందించే సత్తా ప్రభుత్వ పాఠశాలలకు సొంతమని పాఠశాలల్లో ప్రవేశాలు కొనసాగిస్తున్నారు. గురువారం అర్బన్ కాలనీ, నెహ్రూ నగర్, పూసల బజార్ తదితర ప్రాంతాల్లో పాఠశాల ప్రవేశాలకు ఆమె ప్రచారం చేశారు. సీఆర్పీ మురళీ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయా..పాహిమాం

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు దక్షిణంపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామస్తులు గురువారం వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి గ్రామానికి చెందిన పలువురు భక్తులు గజమాల, తులసీదళాల మాల, వడ మాల సమర్పించారు. బుధవారం రాత్రి సీతారాముల శాంతి కల్యాణం కనులపండువగా నిర్వహించారు.

బాబా భక్తుల భిక్షాటన

మార్కాపురం: గురు పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో సాయిబాబా ఆలయంలో మహిళ భక్తులు గురువారం నుంచి సాయి భిక్షాటన కార్యక్రమం ప్రారంభించారు. మందిర కార్యదర్శి హరిహరరావు మాట్లాడుతూ నెల రోజులపాటు గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు పట్టణం, గ్రామాల్లో భిక్షాటన సాగుతుందని, జూలై 1, 2 తేదీల్లో మందిరంలో సామూహిక విష్ణు, లలితా సహస్ర నామార్చన నిర్వహిస్తామని, 3న గురు పౌర్ణమి రోజున 25 వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

సచివాలయానికి వాటర్ కూలింగ్ మిషన్

పొదిలి రూరల్: మండలంలోని తలమళ్ల గ్రామ సచివాలయానికి అదే గ్రామానికి చెందిన ముప్పరాజు శ్రీను, నల్లబోలు వెంకటేశ్వర్లు, వీర్ల బసవయ్య కలిసి రూ.15 వేల విలువైన వాటర్ కూలింగ్ మిషన్ అందజేశారు. సచివాలయానికి పనులపై వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా కూలింగ్ విషన్ అందజేసినట్లు దాతలు పేర్కొన్నారు. దాతలకు సచివాలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

తాళ్లూరు: గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం సందర్శించారు. జిల్లాలో గ్రంథాలయ సెస్‌ల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రంథాలయ భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రంథపాలకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు గురువారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి కళాశాల విద్యలో చేపట్టిన మార్పులకు అనుగుణంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రూప్‌లో సింగిల్ మేజర్ సబ్జెక్ట్, ఒక మైనర్ సబ్జెక్ట్ ఉంటుందన్నారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీలో గణితం, వృక్ష శాస్త్రం, మేజర్ సబ్జెక్టుగా, కంప్యూటర్ సైన్స్, రసాయన శాస్త్రం మైనర్ సబ్జెక్టుగా ఉంటాయి. బీఏలో చరిత్ర మేజర్ సబ్జెక్టు, ఆర్థిక శాస్త్రం మైనర్ సబ్జెక్టుగా ఉంటుందని తెలిపారు.

ప్రశాంత జీవితం యోగాతో సాధ్యం

తాళ్లూరు: యోగా ప్రశాంత జీవితానికి చక్కగా ఉపయోగపడుతుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా విద్యానికేతన్ యోగా పాఠశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా రోజూ చేసిన వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉంటారని, ఎంత శ్రమ చేసినా సరే మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. యోగా శిక్షణ నిపుణుడు శ్రీరామ్ గురూజీ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం శిష్యులు గురూజీని ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి ఐ.వెంకటరెడ్డి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కొర్రపాటి విష్ణు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు సహకరించాలి

● ప్రజలకు సీఐ భీమానాయక్ వినతి



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

మార్కాపురం టౌన్: దొంగతనాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని సీఐ భీమానాయక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. దూర ప్రాంతాలు, విహార యాత్రలు, వివాహాలకు ఇతరత్రా కార్యాలకు 3, 4 రోజులపాటు ఇళ్లు వదిలి వెళ్లేవారు నగదు, బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలని సూచించారు. ముందుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిఘా పెడతామని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాత్రి 11 దాటితే రోడ్లపై తిరగవద్దని, అనుమానితులపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురు అనుమానితులపై బైండోవర్ కేసులు పెట్టి విచారిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

శాశ్వత భూహక్కు పట్టాల పంపిణీ



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: రైతుల ప్రయోజనాల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతోందని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. అందులో భాగంగానే రైతుల కోసం శాశ్వత భూహక్కు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శాశ్వత భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వారి ఆధీనంలో ఉన్న పొలం శాశ్వత భూహక్కు పట్టాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీపీ కడప లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, వైస్ ఎంపీపీ నోవెల్, సచివాలయాల కన్వీనర్ ఓబులరావు పాల్గొన్నారు.

డాక్టర్ కనకదుర్గకు రెడ్‌క్రాస్ పాటర్న్ సర్టిఫికెట్



కలెక్టర్ నుంచి షీల్డ్ అందుకుంటున్న కనకదుర్గ

మార్కాపురం: మార్కాపురం మున్సిపల్ కౌన్సిలర్, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్, రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఇన్‌చార్జి డాక్టర్ చెప్పల్లి కనకదుర్గకు కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాటర్న్ సర్టిఫికెట్‌ను అందజేశారు. మార్కాపురం ప్రాంతంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆమెను ప్రశంసించారు. కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

టీబీని నిర్మూలించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: టీబీని నిర్మూలించాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన టీబీ ముక్త పంచాయత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరోనాను జయించడంలో ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. కరోనాను జయించిన నేపథ్యంలో టీబీని కూడా జయించేందుకు మనకు అనేక మందులు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. ఆరోగ్యం కోసం ప్రభుత్వం నేడు అనేక రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చి ఉచితంగా వైద్యసేవలు అందిస్తోందన్నారు. వైద్యశాలలను అభివృద్ధి చేయడమే కాకుండా ప్రతి జిల్లాకు రెండు బోధనాస్పత్రులు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎంఎల్ పిహెచ్‌ల సేవలు ఉపయోగించుకుని టీబీ రోగాన్ని తరిమికొట్టాలని వైద్యాధికారి పి.ప్రవీణ్ సూచించారు. దర్శి టీబీ యూనిట్ ఇన్‌చార్జి సాయిప్రసాద్, ఆవుల వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాలిరెడ్డికి ఎమ్మెల్యే అన్నా నివాళి

కంభం: మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ సబ్బసాని గాలిరెడ్డి (89) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు.. గాలిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కంభం, నడింపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.